క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కరణ్ బాగ్, జీపీ పార్క్, జీపీ కాలనీ, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతి కల్యాణ మండపం, సాయిరాం కాలనీ పరిసరాలు.
- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు .. శంకేశ్వరబజార్, సరస్వతీనగర్, కోదండరామ్‌నగర్, సాహితీనగర్, సన్‌షైన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన లోగోను ఆర్‌కేపురం పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సభ్యులు రమేష్‌కుమార్, వినోద్, దిలీప్, రాంసన్, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: నాగోల్ డివిజన్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ విద్యా సంస్థల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు, పుస్తకాలు, యూనిఫామ్‌లు తమ వద్దే కొనాలని తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలంకార ప్రాయం.. సెంట్రల్ లైటింగ్



ఎర్రకుంట రోడ్డులో వెలగని వీధి దీపాలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ నుంచి ఎర్రకుంట వరకు రూ. 60లక్షల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొంటోంది. పహాడీషరీఫ్ నుంచి క్యూబా కాలనీ చౌరస్తా వరకు మాత్రమే వెలుగుతుండగా.. అక్కడి నుంచి ఎర్రకుంట వరకు మాత్రం ఒక్క లైట్ కూడా వెలగడం లేదు. రాత్రి పూట అంధకారం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాదే ఈ రోడ్డులో ఈ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇలా వీధి దీపాలు అలంకార ప్రాయంగా మారడం పట్ల స్థానికులు మండి పడుతున్నారు. ఏ పట్టణంలోనైనా విద్యుద్దీపాల వెలుగులు జిగేలుమంటుండగా.. జల్‌పల్లి పట్టణంలో మాత్రం ఇలా అంధకారం నెలకొని ఉండడమేంటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వీధిదీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సోనీ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

బడంగ్‌పేట్: పంచాయతీ సెక్రటరీ సోనీ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోనీ మృతికి సంతాపంగా మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రటరీలతో గొడ్డు చాకిరీ చేయించుకున్న ప్రభుత్వం వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. పంచాయతీ జూనియర్ సెక్రటరీలను పర్మినెంట్ చేయాలని ధర్నా చేస్తుంటే డ్యూటీకి రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగడంతో ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకుందన్నారు. నిజానికి సోనీది ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. సోనీ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మహేష్‌చారి, నియోజకవర్గం మహిళా కన్వీనర్ ఇందుమతి, పవన్, జ్ఞానేశ్వర్, అనిత, లలిత, సబిత, యాదయ్య, మధుకర్, మహేష్, శివ, సరిత తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధానికి చెల్లు.. సుగంధ పరిమళాలు వెదజల్లు!

మన్సూరాబాద్: గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం...జంతు కళేబరాలు... దుర్వాసనతో అవస్థలు పడుతున్న సమీప కాలనీవాసులు...ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలోని ప్రస్తుత దుస్థితి ఇదీ. మరికొంత కాలంలో ఈ ప్రాంతం సువాసన వెదజల్లే సుందర ప్రదేశంగా మారనుంది. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక కృషితో త్వరలో ఈ ప్రాంతం దేశంలోనే అత్యుత్తమైన ఫ్లవర్ పార్కుగా రూపుదిద్దుకోనుంది.



ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో ఏర్పాటయ్యే ఫ్లవర్ పార్కు నమూనా చిత్రం

వైఎస్‌ఆర్ చలువతో డంపింగ్‌యార్డ్ ఎత్తివేత

నాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి మన్సూరాబాద్ ప్రాంతవాసులు చేపడుతున్న పోరాటాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే డంపింగ్‌యార్డ్‌ను ఈ ప్రాంతం నుంచి ఎత్తివేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోనగర్ నుంచి డంపింగ్ యార్డ్ మరో ప్రాంతానికి తరలించారు. అయితే, కొన్నేళ్లుగా పేరుకపోయి చెత్త కారణంగా అక్కడ ఇప్పటికీ దుర్గంధం వెదజల్లుతూనే ఉంది.

ఫ్లవర్ పార్కు కోసం ఎమ్మెల్యే యత్నం..

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో దుర్వాసను అరికట్టి ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

47 ఎకరాల విస్తీర్ణం..

ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్ సుమారు 47 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. జాతీయ రహదారి క్రీడా వద్ద అంతర్జాతీయ బస్ టెర్మినల్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో క్రీడా సంస్థ నుంచి సుమారు 2 ఎకరాల విస్తీర్ణం స్థలాన్ని తీసుకుంటున్నారు. ఈ స్థలాన్ని తీసుకుంటున్నందుకు గాను జీహెచ్‌ఎంసీ క్రీడా సంస్థకు 4 ఎకరాల చెత్త డంపింగ్ యార్డ్ స్థలాన్ని కేటాయిస్తోంది. మిగిలిన సుమారు 43 ఎకరాల స్థలంలో అంతర్జాతీయ స్థాయి ఫ్లవర్‌పార్కు ఏర్పాటు కానుంది.



డంపింగ్‌యార్డ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి (ఫైల్)

దేశంలోనే అత్యుత్తమ ఫ్లవర్ పార్కుగా నిర్మిస్తాం



ఆటోనగర్ చెత్త డంపింగ్ యార్డ్ ప్రాంతంలో దేశంలో అత్యుత్తమ ఫ్లవర్ పార్కు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని కోర్టు కేసుల కారణంగా జాప్యం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించి కోర్టు వివాదాలను పరిష్కరించింది. సుమారు 43 ఎకరాల విస్తీర్ణంలో ఫ్లవర్‌పార్కు నిర్మాణానికి సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. నాడు చెత్త డంపింగ్‌యార్డ్‌తో తీవ్ర దుర్వాసనతో ఉన్న ప్రాంతాన్ని నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు సీఎం కేసీఆర్ చలువతోనే ఫ్లవర్‌పార్కుగా రూపుదిద్దుకోనుంది. త్వరలోనే ఫ్లవర్ పార్కు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తాం.

– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

అక్రమంగా విదేశీ మద్యం సరఫరా

- ఐదుగురి అరెస్టు
- 159 బాటిళ్ల స్వాధీనం

దిల్‌సుఖ్‌నగర్: అనుమతులు లేకుండా అక్రమంగా విదేశీ మద్యం సరఫరా చేస్తున్న ఐదుగురిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివిధ బ్రాండ్లకు చెందిన 159 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఆర్‌కేపురంలోని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ నివాసి సంరెడ్డి రవికాంత్‌రెడ్డి అనుమతి లేకుండా విదేశీ మద్యంను సరఫరా చేస్తున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 9 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రవికాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా, తాను ఆదిభట్లకు చెందిన శ్రీవీర్‌గౌడ్ వద్ద నుంచి కొనుగోలు చేశానని చెప్పారు. పోలీసులు శ్రీవీర్‌గౌడ్ అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 12 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు విచారణలో అతడు అల్మాగూడకు చెందిన వెంకన్న దగ్గర కొనుగోలు చేశానని చెప్పడంతో పోలీసులు వెంకన్న నివాసంపై దాడి చేయగా 54 విదేశీ మద్యం సీసాలు దొరికాయి.



నిందితులను, స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

విచారణలో అతడు తాను కాప్రాకు చెందిన సాయికిరణ్‌కుమార్, నాగరాజుల దగ్గర మద్యం సీసాలు కొనుగోలు చేశానని చెప్పాడు. దీంతో పోలీసులు సాయికిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 84 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా, తిరుమలగిరికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశానని చెప్పాడు. అలాగే ఇతను సీఎస్‌డీ క్యాంటీన్ నుంచి మద్యం తెచ్చి ఇతరులకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. అధికారు ఐదుగురినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొత్తం 159 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ దందాతో సంబంధం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఎక్సైజ్ అధికారులు జీవన్‌కిరణ్, శ్రీధర్, శ్రీనివాస్, కల్పన, కూర్మనాయకులు పాల్గొన్నారు.

చైతన్యనగర్ కాలనీ అధ్యక్షుడిగా జలంధర్‌రెడ్డి



ఎల్‌బీనగర్: బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని చైతన్యనగర్ కాలనీ అధ్యక్షుడిగా జలంధర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. కాలనీ అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు నిర్వహించి మంగళవారం ఓట్లు లెక్కించగా జలంధర్ రెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, కాలనీ వాసులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ సీఈఓ కేజియాకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సాలి కేజియా

మలక్‌పేట: ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ జర్మనీ వారు హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు, నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సోషల్ వర్కర్ సాలి కేజియాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తమిళనాడులోని ఊటీలో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందజేశారని ఆమె తెలిపారు. 30 సంవత్సరాలు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సాలి కేజియా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్‌ద్వారా పేదల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

ఉన్నత విద్యకు చేయూతనివ్వండి

ఆర్థిక సాయం కోసం అనాథ దివ్యాంగుడి వేడుకోలు



చిత్తలూరి వేణు

చాదర్‌ఘాట్: పారిశ్రామికవేత్త కావాలనే ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకున్న అనాథ దివ్యాంగుడు చదువులో చురుగ్గా ఉంటూ డిగ్రీ పూర్తి చేశాడు. మంచి యూనివర్సిటీలో ఉన్నత చదువు కోసం అవకాశం కూడా వచ్చింది. కానీ రెండేళ్ల కోర్సుకు ఫీజులు చెల్లించే స్తోమత లేకపోవడంతో నిస్సహాయంగా ఉండి పోతున్నాడు. ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సేవ సంస్థ (ఎన్‌జీఓ)లు, దయార్ద్ర హృదయులు తనకు ఆర్థిక సాయం చేస్తే ఎంబీఏ పూర్తి చేస్తానని అంటున్నాడు. నల్గొండ జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లెకు చెందిన చిత్తలూరి వేణుకు చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించారు. తనకు 72 శాతం వైకల్యం ఉన్నా.. కష్టపడి డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం చైతన్యపురిలోని ప్రభుత్వ ఆర్థోపెడికల్లీ హ్యాండీ క్యాప్డ్ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్నాడు. అతనికి ఒడిశాలోని ఏఎస్‌బీఎం యూనివర్సిటీలో ఎంబీఏ చదివేందుకు అడ్మిషన్ లభించింది. కానీ, రెండేళ్ల చదువుకు రూ.8 లక్షల ఫీజు చెల్లించాలి. దాతలు ఆర్థికంగా సహకరిస్తే ఉన్నత విద్య పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలని కోరుకుంటున్నాడు. మరిన్ని వివరాలకు 7995505688లో సంప్రదించవచ్చు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

హస్తినాపురం: హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురభి హోటల్‌లోని రెస్టారెంట్‌లోని రూమ్ నంబర్ 410లో పేకాటాడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు , వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పేకాటాడుతున్న అనిల్‌కుమార్, రామాంజనేయులు, హరీష్, వెర్మరాజు, నాగరాజులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 36,780 నగదు, ఐదు సెల్‌ఫోన్లు , ఒక సెట్ పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోలో మర్చిపోయిన నగలు బాధితురాలికి అప్పగింత

హస్తినాపురం : ఆటోలో ప్రయాణికురాలు మరిచిపోయిన బంగారు ఆభరణాలను గుర్తించి బాధితురాలికి అందజేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. నగరంలోని ఎస్‌ఆర్ నగర్‌లో నివాసం ఉండే జమ్ముల రాణి మంగళవారం రాపిడ్ ఆటోలో ప్రయాణించి వనస్థలిపురంలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఉన్న తన సోదరుడి ఇంటికి చేరుకుంది. ఆటో దిగే హడావుడిలో 65.5 గ్రాముల బంగారు నగలు ఉన్న పర్సును ఆటోలో మరిచిపోయింది. తర్వాత ఈ విషయం గమనించిన ఆమె వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆటోను గుర్తించారు. ఆటోలో మరిచిపోయిన మొత్తం 65.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీఐ జలేంధర్‌రెడ్డి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో డీఐ వెంకట్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నగలను బాధితురాలికి అందజేస్తున్న సీఐ

వ్యక్తి అదృశ్యం



పెంటయ్య

హస్తినాపురం: వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాంపురం గ్రామానికి చెందిన 30 మంది మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి నర్సింహారావునగర్ కాలనీలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వీరిలో మండ్ల పెంటయ్య (50) అనే వ్యక్తి ఈనెల 13న పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండగా, భార్య ముత్యాలమ్మ కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఆమె తిరిగి వచ్చే సరికి పెంటయ్య కనిపించలేదు. దీంతో భార్య తన భర్త ఆచూకీ కోసం స్థానికులను, బంధు,మిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీల యజమానులు ఐకమత్యంగా ఉండాలి



జాస్పర్ ఇండస్ట్రీస్ వద్ద లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నందారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: ఇసుక లారీలందరూ ఐకమత్యంగా ఉంటే సమస్యలను వెంటనే పరిష్కరించుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందారెడ్డి అన్నారు. కొత్తపేట లారీ అసోసియేషన్ సభ్యుడైన కుండే వెంకటేష్‌కు చెందిన 16 టైర్ల లారీ ఇంజిన్ సీజ్ కావడంతో మన్సూరాబాద్ ఆటోనగర్‌లోని జాస్పర్ వర్క్ షాప్‌లో పెట్టడం జరిగింది. వర్క్ షాప్ నిర్వాహకులు సదరు లారీకి వారెంటీని రిజెక్టు చేశారు. దీంతో అసోసియేషన్ అధ్యక్షుడు నర్రి వెంకన్న పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందారెడ్డి, వివిధ అడ్డాల అధ్యక్షులు సదరు వర్క్ షాప్ వద్దకు చేరుకున్నారు. జాస్పర్ ఇండస్ట్రీస్ హెడ్‌తో మాట్లాడి వారెంటీలోనే పనులు చేయించేలా ఒప్పించారు. ఈ సందర్భంగా నందారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఏ ఒక్క లారీ యజమానికి అన్యాయం జరిగినా రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, సుర్వీ రాజుగౌడ్, ప్రతాప్ రెడ్డి, నర్రి జంగయ్య, అంజయ్యగౌడ్, శ్రీశైలం, అంతటి నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అంతర్జాతీయ బస్ టెర్మినల్ పనులు ప్రారంభం

- బీజేపీ, కాంగ్రెస్ అడ్డుకోవడంతో కొంతమేర జాప్యం
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ఆటోనగర్ క్రీడా వద్ద అధునాతన బస్ టెర్మినల్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్విరాన్మెంట్ కన్సల్టెంట్ సభ్యులు మురళి, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఢిల్లీలోని అటవీశాఖ అనుమతి కోరామని, వారు మార్పులు చేయాలని సూచించడంతో పకడ్బందీగా ఫైల్‌ను సిద్ధం చేశామన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభం కావాల్సిన బస్ టెర్మినల్‌ను బీజేపీ, కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో జాప్యం జరిగిందని విమర్శించారు. పట్టువదలని విక్రమార్కుడిలా 102 సార్లు అరణ్యభవన్ చుట్టూ తిరిగి పలు సమావేశాలు ఏర్పాటు చేసి చివరకు విజయం సాధించామన్నారు.

తొలి శాటిలైట్ బస్ టెర్మినల్...

దేశంలోనే తొలి శాటిలైట్ బస్ టెర్మినల్ ఆటోనగర్‌లో రూపుదిద్దుకోనుందని స్పష్టం చేశారు. రూ.18 కోట్ల వ్యయంతో 24 బస్‌బేలతో అధునాతన టెర్మినల్ ఏర్పాటు కానుందన్నారు. ఈ బస్‌టెర్మినల్ నుంచి సుమారు 20 నుంచి 25వేల మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణాలు సాగిస్తారని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఒక మార్గం, నగర సర్వీసులకు మరో మార్గం, ప్రైవేటు వాహనాలకు మరో మార్గం ఉంటుందన్నారు. ఏసీ, నాన్ ఏసీ నిరీక్షణ గదులు, వైఫై సౌకర్యం, నీటిశుద్ధి కేంద్రం, పార్కింగ్ సదుపాయం, ఏటీఎం కేంద్రం, ఫుడ్ కోర్టులు, బుక్‌షాప్, ఆరోగ్య కేంద్రం వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. తమ వారు క్షేమంగా బస్సు ఎక్కారో లేదో అనే బెంగ లేకుండా ఫోన్‌లో చూసుకునే సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెండింగ్ పనుల ప్రారంభం సంతోషకరం

మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఎన్నో ఏళ్లుగా సహారాస్టేట్స్ కాలనీ వాసులు ఎదురుచూస్తున్న బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభం కావటం సంతోషకరమని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సహారాస్టేట్స్ కాలనీలో రూ.87.30 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, వారిపై ఒత్తిడి పెంచి ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కాలనీ బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించానని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీ కావడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో కొంతమేర జాప్యం జరిగిందన్నారు. కాలనీలోని మిగిలిన రోడ్లపై కూడా బీటీ వేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, వల్లూరిపల్లి పార్థసారథి, సయ్యద్‌జానీ, రాపోలు విశ్వనాథ్, జగత్ రెడ్డి పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

జాగ్రత్తలు పాటిద్దాం.. డెంగీని నిర్మూలిద్దాం

మన్సూరాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని కనీస జాగ్రత్తలు పాటిస్తే డెంగీ వ్యాధిని నిర్మూలించవచ్చని మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ పులేందర్‌నాయుడు, ఎంటమాలజీ ఏఈ రవీందర్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మన్సూరాబాద్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ, తమ ఇళ్లలో నిల్వ ఉంచిన పనికిరాని వస్తువులను వెంటనే తొలగించాలన్నారు. నిల్వ ఉన్న పాతటైర్లలో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్నవారు వెంటనే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగీ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వం నిర్దేశించిన ఆసుపత్రుల్లో ఉచితంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ జనార్ధన్, ఎంటమాలజీ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ పులేందర్‌నాయుడు, ఎంటమాలజీ ఏఈ రవీందర్

కంప్యూటర్ లాబ్‌కు రూ.25 వేలు విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న సత్యనారాయణ

దిల్‌సుఖ్‌నగర్: సికింద్రాబాద్ ఖానాజిగూడకు చెందిన సత్యనారాయణ ఆర్‌కే పురంలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల కంప్యూటర్ లాబ్‌కు అత్యవసరమైన హెడ్‌సెట్స్ కొనుగోలు కోసం రూ.25 వేలను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ. అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనాథ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయంతో పాటు విద్యా సౌకర్యం కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేయడం అభినందనీయమన్నారు. విరాళం ఇచ్చిన సత్యనారాయణకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ సతీమణి శ్రీమతి సత్యకళ, గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

మైనారిటీలకు అండగా ఉండేది కాంగ్రెస్ మాత్రమే

మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిందని, వారికి అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. చైతన్యపురిలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ మైనారిటీ సెల్ సెక్రటరీగా మహమ్మద్ రబ్బానీ, లింగోజిగూడ డివిజన్ మైనారిటీ సెల్ చైర్మన్‌గా మహ్మద్ షఫీలను నియమిస్తూ వారికి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, పోలీసు అధికారులుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. తెలంగాణలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీలను ఓటు బ్యాంక్‌గా మార్చి మాయమాటలతో మభ్యపెడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా మైనారిటీలు నిజాలు తెలుసుకుని కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ చైర్మన్ మక్సూద్ అలీ, లింగోజిగూడ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మల్లారపు శ్రీనివాస్, నాయకులు పన్యాల జైపాల్‌రెడ్డి, మతిన్, షరీఫ్, అబ్దుల్ హమీద్, ఇర్ఫాన్, అన్వర్, నజీర్ అఫ్సర్ పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

పాత పనులకు ప్రారంభోత్సవాలా?

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో రెండేళ్ల క్రితం పూర్తయిన సీసీ రోడ్డు పనులను ఇప్పుడు ప్రారంభించడమేమిటని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం కాలనీవాసులతో కలిసి ఆయన మాట్లాడారు. 31వ డివిజన్‌లో గత శనివారం మంత్రి సబితారెడ్డి, మేయర్ పారిజాత, కార్పొరేటర్లు రెండేళ్ల క్రితం పూర్తయిన సీసీ రోడ్లను ప్రారంభించారని, దీన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. శిలాఫలకాలు వేసి ఏళ్లు కావస్తున్నా పనులు ప్రారంభించలేదని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, అవేమీ మంత్రికి పట్టడం లేదని ఆయన ఆరోపించారు. శిలాఫలకాల మంత్రి అని మరోమారు సబితారెడ్డి రుజువు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవాలను నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు.